
# సాక్షి గుంటూరు

మంగళవారం । 25 । ఏప్రిల్ । 2023



## కంటైనర్ పల్టీ


కొల్లూరు: కరకట్టపై వెళ్తున్న ఓ కంటైనర్ అదుపు తప్పి పల్టీ కొట్టిన ఘటన కొల్లూరు వద్ద సోమవారం చోటుచేసుకుంది. ఘటనలో ఎవరూ గాయపడలేదు.



## నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4,000, గరిష్ట ధర రూ.5,600, మోడల్ ధర రూ.4,800 వరకు పలికింది.

## కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా సోమవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

## న్యూస్‌రీల్

### యార్డుకు 1,28,502 మిర్చి బస్తాలు రాక




కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,28,502 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,22,259 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.24,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.25,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 81,646 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

### ప్రత్తిపాడులో 50.4 మి.మీ వర్షం

కొరిటెపాడు(గుంటూరు): జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు అత్యధికంగా ప్రత్తిపాడు మండలంలో 50.4 మిల్లీ మీటర్ల వర్షం పడగా, అత్యల్పంగా ఫిరంగిపురం మండలంలో 1 మి.మీ వర్షం పడింది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి... వట్టిచెరుకూరు 15.4 మి.మీ., కాకుమాను 15.2, పొన్నూరు 8.8, చేబ్రోలు 4, గుంటూరు పశ్చిమ 2, దుగ్గిరాల 1.2, గుంటూరు తూర్పులో 1.2 మి.మీ చొప్పున వర్షం పడింది.

### సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 523.10 అడుగుల వద్ద ఉంది. ఇది 154.9888 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకి 4,940, ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్ ఫ్లోగా 6,740 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 2,416 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 804.40 అడుగుల వద్ద ఉంది. ఇది 31.2203 టీఎంసీలకు సమానం.

### 115 మంది నైట్ వాచ్‌మెన్‌ల నియామకం

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని 115 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో రాత్రి కాపలాదారుల నియామకానికి చర్యలు చేపట్టినట్లు డీఈఓ పి.శైలజ సోమవారం చెప్పారు. ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి నెలకు రూ.6వేల వేతనంపై రాత్రి వేళల్లో కాపలాదారుల నియామకానికి సంబంధించిన ప్రక్రియను ఈనెల 27వ తేదీలోపు పూర్తి చేయాలని ఆయా పాఠశాలల హెచ్ఎంలను డీఈఓ ఆదేశించారు. పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయా భర్తకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి నియామకం చేపట్టాలని సూచించారు. వీలుకాని పక్షంలో ఎక్స్ సర్వీసు మ్యాన్, స్థానికంగా ఉన్న వ్యక్తిని పేరెంట్ కమిటీ ఆధ్వర్యంలో నియమించాల్సి ఉందని తెలిపారు. నాడు – నేడు ద్వారా ఆధునికీకరించిన ప్రభుత్వ, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో విలువైన సామగ్రి భద్రత, రక్షణ కోసం ప్రభుత్వం రాత్రి కాపలాదారుల నియామకానికి ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు.

### రామానుజుల వారికి తిరుమంజన సేవ



తాడేపల్లిరూరల్: సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై సోమవారం రామానుజుల వారికి తిరుమంజన సేవ నిర్వహించినట్లు జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మేనేజర్ పురాణం వెంకటాచార్యులు తెలియజేశారు. భగవత్ రామానుజుల వారి తిరునక్షత్ర ఉత్సవాల్లో భాగంగా త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళ శాసనాలతో ఉదయం తిరుమంజన సేవ, అలంకరణ, తదుపరి కనకాంబరం పుష్పాలతో సహస్రనామార్చన, అనంతరం తీర్థప్రసాద గోష్ఠి కార్యక్రమాలు నిర్వహించామని అన్నారు.

# అసమ్మతి.. అధోగతి

**టీడీపీలో తీవ్ర స్థాయిలో వర్గ పోరు**

- సత్తెనపల్లికి ఇన్‌చార్జిని ప్రకటిస్తారా?
- అక్కడ ఇప్పటికే మూడు వర్గాలు... తాజాగా రంగంలోకి కన్నా
- పెదకూరపాడులో నిస్తేజంలో క్యాడర్
- తాడికొండలో శ్రావణ్ కుమార్‌కు రాయపాటి వర్గం చెక్..
- తమ వర్గం నుంచి మరో అభ్యర్థిని తెరపైకి
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో మూడు రోజుల పర్యటనకు చంద్రబాబు...



సత్తెనపల్లిలోని పార్టీ కార్యాలయం వద్ద చంద్రబాబు ఫ్లెక్సీని చింపేసిన మరో వర్గం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ఉమ్మడి గుంటూరు జిల్లా పర్యటనను ఎలా విజయవంతం చేయాలో తెలియక పార్టీ నేతలు తలలు పట్టుకుంటున్నారు. ఆయన పర్యటించనున్న మూడు నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితి ఏమంత ఆశాజనకంగా లేకపోవడం మరోవైపు వర్గాలతో రోడ్డెక్కుతుండటంతో పర్యటన విజయవంతం చేయడం వారికి కత్తిమీద సాములా మారింది. పట్టణంలో అయితే ఒక్కో వార్డు నుంచి నాలుగు వందల మంది, గ్రామంలో అయితే వెయ్యి మందిని సమీకరించాలని పై నుంచి ఆదేశాలు వచ్చాయి. ఒక్కొక్కరికి రూ.300 ఇచ్చి తెలుగుదేశం టీషర్ట్, పసుపు చీర ధరించి వచ్చేలా చూడాలని చెప్పడంతో వారు దీనిపై దృష్టి పెట్టారు. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు పెదకూరపాడు, సత్తెనపల్లి, తాడికొండ నియోజకవర్గాల్లో చంద్రబాబునాయుడు పర్యటన సాగేలా షెడ్యూల్ రూపొందించారు.

**అసమ్మతి రాగం.. అంతర్గత కలహాలు**

పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌కు సొంతపార్టీలోనే అసమ్మతి రాగం వినిపిస్తోంది. 2019లో ఓటమి తర్వాత కనీసం కార్యకర్తలకు కూడా అందుబాటులో లేకుండా పోవడం, సొంత వ్యాపారాలపై దృష్టి పెట్టడంతో కార్యకర్తలు పూర్తి స్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న నూతలపాటి వెంకటశివ బహిరంగంగానే కొమ్మాలపాటి తీరును ఎండగడుతూ మీడియాకి ఎక్కారు. అమరావతి మండలం ధరణికోట గ్రామానికి చెందిన ఎన్నారై వట్టికుంట శేషగిరిరావు నియోజకవర్గంలో తెలుగుదేశంపార్టీ పేరుతో పెద్ద ఎత్తున ఎడ్లపందేలు, వైద్య శిబిరాలు నిర్వహిస్తూ, కొమ్మాలపాటిని పిలవకపోవడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా ఉంది. ఇటీవల సంక్రాంతి పండుగ రోజు పెదకూరపాడు మండలం హుస్సేన్ నగర్ గ్రామానికి చెందిన మరో ఎన్నారై భానుప్రకాష్ టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరిని తీసుకొచ్చి ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఆ సమావేశానికి కొమ్మాలపాటి శ్రీధర్, ఆయన అనుచరగణం డుమ్మాకొట్టారు. ఇటీవల పెదకూరపాడు మండలం తెలుగు మహిళ జిల్లా నాయకుల మధ్య వాట్సాప్ వేదికగా మాటల యుద్ధం జరుగుతోంది. ఈ క్రమంలో ఒకరిపై మరొకరు కేసులు పెట్టుకున్నారు. కేడర్‌ను నడిపించలేని పరిస్థితిలో కొమ్మాలపాటి శ్రీధర్ ఉన్నాడని జిల్లా తెలుగు మహిళ కార్యవర్గ సభ్యురాలు సుజాత బహిరంగంగానే విమర్శలు చేశారు. అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ మండలాల్లో ద్వితీయ శ్రేణి నాయకులు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. తాజాగా చంద్రబాబు రోడ్‌షో కోసం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చింపేశారంటూ కొమ్మాలపాటి వర్గంపై శేషగిరిరావు వర్గం గొడవకు దిగడం గమనార్హం.

**నాలుగు స్తంభాలాట..**

సత్తెనపల్లి నియోజకవర్గంలో నాలుగు స్తంభాలాట నడుస్తోంది. పార్టీ ఇన్‌చార్జ్ పదవి కోసం మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు కుమారుడు కోడెల శివరాం, మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు, తెలుగు యువత నాయకుడు మన్నెం శివనాగమల్లేశ్వరరావు(అబ్బూరి మల్లి)లు పోటీ పడుతున్నారు. ఈ ముగ్గురికి పోటీగా మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ కూడా సత్తెనపల్లిపై దృష్టి పెట్టారు. ఇప్పటివరకూ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ను ఖరారు చేయలేదు. కలిసికట్టుగా పనిచేయమని చంద్రబాబు సూచించినా మూడు గ్రూపులుగా విడిపోయి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సత్తెనపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ భవన్ ఎదుట ఒక వైపు కోడెల శివరాం, మరో వైపు వైవీ ఆంజనేయులు చిన్న షెడ్లు ఏర్పాటు చేసి అన్నా క్యాంటీన్ పేరుతో ఒక పూట భోజనం పెడుతున్నారు. ఇలా కొద్ది రోజులు పెట్టిన తరువాత కోడెల శివరాం మొబైల్ క్యాంటీన్ ఏర్పాటు చేసి ఒక పూట భోజనం పెడుతున్నారు. ఇక మన్నెం శివనాగమల్లేశ్వరరావు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గల ఎన్టీఆర్ విగ్రహం వద్ద అన్నా క్యాంటీన్ పేరుతో మధ్యాహ్నం పూట భోజనం పెడుతున్నారు. చంద్రబాబు జన్మదినం సందర్భంగా ఈ నెల 20న ఎన్టీఆర్ భవన్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఒక వర్గం చించివేసింది. చంద్రబాబు ఫ్లెక్సీలను చించిన వారిని అరెస్ట్ చేయాలని ఆ పార్టీ తెలుగు యువత పట్టణ మాజీ అధ్యక్షుడు యెల్లినేడి శ్రీనివాస్ ఆందోళన చేపట్టారు. రెండురోజుల క్రితం చంద్రబాబు రాక సందర్భంగా జనసమీకరణ అంశంపై జరిగిన సమావేశం కూడా రసాభాసగా మారింది.

**వర్గపోరుతో సతమతం..**

తాడికొండ తెలుగుదేశంలో వర్గ విభేదాలు భగ్గుమంటున్నాయి. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడుగా పనిచేస్తున్న మాజీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ ప్రస్తుతం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్నారు. గత ఎన్నికల నుంచే కమ్మ సామాజిక వర్గానికి చెందినవారు ఈయనను అభ్యర్థిగా పెట్టడంపై గుర్రుగా ఉండటంతో పాటు సీటిస్తే ఓడి స్తాం అంటూ చంద్రబాబు నాయుడుకే బహిరంగంగా అల్టిమేటం జారీ చేశారు. ఆ సమయంలో బాపట్ల ఎంపీగా కొనసాగుతున్న మాల్యాద్రిని ఇక్కడ సమన్వయకర్తగా వేయడంతో శ్రావణ్ కుమార్ వర్గం కూడా గట్టిగా వ్యతిరేకించడంతో సీటు కేటాయించినా ఓటమి పాలయ్యాడు. అయితే ప్రస్తుతం ఆయనకు నియోజకవర్గంలోని 4 మండలాల్లో ఓ వర్గం బలంగా సీటు ఇవ్వకుండా పావులు కదుపుతుంది. ఇందులో భాగంగా తొలి నుంచి ఈ నియోజకవర్గంపై పట్టున్న రాయపాటి సాంబశివరావు, తుళ్లూరు మండలం బోరుపాలెం గ్రామానికి చెందిన తోకల రాజవర్ధన్‌ను నేరుగా రంగంలోకి దింపి తాము రాజవర్ధన్‌కు సీటిస్తే గెలిపిస్తామంటూ బహిరంగంగా ప్రకటించారు. అయితే తుళ్లూరు మండలంలో దళిత జేఏసీలో చురుగ్గా పనిచేస్తున్న కంభంపాటి శిరీష వర్ల రామయ్య కోటరీ నుంచి అభ్యర్థిగా రంగంలోకి దిగాలనే యోచనతో శ్రావణ్‌కుమార్‌కు వ్యతిరేకంగా పావు లు కదుపుతుంది. ఇప్పటికే ఆమె తుళ్లూరు మండలంలో ప్రధాన సామాజిక వర్గంలోని ఓ గ్రూపుతో సన్నిహితంగా ఉంటూ రాజకీయం నడుపు తున్నారు. అమరావతి జేఏసీలో సభ్యుడిగా ఉన్న కొలికపూడి శ్రీనివాసరావు కూడా మరో వర్గాన్ని నడుపుతున్నారు.

## ఇళ్ల లబ్ధిదారులను ప్రోత్సహించండి

**స్పందనలో అధికారులకు కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి సూచన**



గుంటూరు వెస్ట్: జగనన్న కాలనీల్లోని ఇప్పటికే స్థలం పొందిన లబ్ధిదారులు ఇంటి నిర్మాణాల కోసం ఇచ్చే అర్జీలను జాగ్రత్తగా పరిశీలించి వారిని ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారులకు నిర్మాణాలకు సంబంధించి ఉన్న సందేహాలను నివృత్తి చేయాలన్నారు. ఇప్పటి కాలనీలు భవిష్యత్తులో నగరాలుగా మారిపోతాయని చెప్పారు. దీనికి సంబంధించిన అర్జీలు గ్రామ, వార్డు సచివాలయాల్లో వస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారమివ్వాలన్నారు. వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. కోర్టు ధిక్కరణ కేసుల్లో నిర్లక్ష్యంగా ఉండవద్దని హితవు పలికారు. అనంతరం వచ్చిన 162 అర్జీలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్‌ఓ చంద్రశేఖరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.వెంకట రామిరెడ్డి, జిల్లా అధికారులు పరిశీలించారు.

**అధికారులపై వచ్చిన ఫిర్యాదులను విచారించండి..**



జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖాధికారులపై తరచూ వస్తున్న అవినీతి ఆరోపణలపై విచారించి కఠిన చర్యలు తీసుకోవాలి. దివ్యాంగులకు సేవ చేయాల్సిన కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారు. దీనివల్ల దివ్యాంగులకు తీవ్ర నష్టం జరుగుతుంది. దివ్యాంగులకు అందాల్సిన త్రిచక్ర వాహనాలపైనా వీరు నిబంధనలు పాటించడం లేదు.

– డి.రమణయ్య, జిల్లా అధ్యక్షుడు నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి

# తీవ్ర జ్వరం.. నివారణే పరిష్కారం

- సోకితే వదలదు.. ఎటూ కదలనీయదు
- మలేరియాపై అప్రమత్తత అవసరం
- దోమకాటు ద్వారా వ్యాప్తి
- నేడు వరల్డ్ మలేరియా డే




మలేరియాపై అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, జేసీ రాజకుమారి

గుంటూరు మెడికల్: మలేరియా ఈ పేరు చెబితేనే చాలా మంది ప్రజలు వణికిపోతారు. నెలల తరబడి జ్వరం పీడిస్తూ ఉండటమే కారణం. వ్యాధి సోకిదంటే ఒక పట్టాన త్వరగా శరీరాన్ని వదిలిపోదు. ప్రతి ఏడాది అనేక లక్షల మంది దీని బారిన పడుతున్నారు. మలేరియాపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో 2007లో వరల్డ్ హెల్త్ అసెంబ్లీ ఏప్రిల్ 25వ తేదీని వరల్డ్ మలేరియాడే గా నిర్ధారించింది. 2007 నుంచి ప్రతి ఏడాది ఏప్రిల్ 25న దీనిని నిర్వహిస్తున్నారు.

**మలేరియా లక్షణాలు...**

ఈ వ్యాధి అనాఫిలిస్ దోమకాటు వల్ల వస్తోంది. చలి, వణుకుతో కూడిన విపరీతమైన జ్వరం, ఒళ్లు నొప్పులు, మూత్రం మందగించటం, కడుపులో నొప్పి, జ్వరం మూడురోజులకొకసారి లేదా రెండురోజులకొకసారి లేదా రోజుమార్చి రోజు వస్తూ ఉండటం దీని లక్షణాలు. సరైన వ్యాధి నిర్ధారణ, చికిత్స చేయని పక్షంలో నెలల తరబడి వ్యాధి పీడిస్తోంది. కొందరిలో సెరిబ్రల్ మలేరియా, వైవ్యాక్స్ మలేరియాలు కూడా వస్తాయి. ఈ వ్యాధులు సోకిన వారిలో ప్లేట్‌లెట్స్ తగ్గిపోవటం, కామెర్లు పెరిగిపోవటం, నిమోనియా, ఫిట్స్, మూత్రపిండాలు చెడిపోవటం, స్పృహ కోల్పోవడం జరుగుతుంది. మలేరియా ఉన్న వ్యక్తి రక్తం ఎక్కించటం ద్వారా, మలేరియా వ్యాధి ఉన్న వ్యక్తిని కుట్టిన దోమ ఇతరుల్ని కుట్టటం ద్వారా సోకుతోంది.

**నిర్ధారణ....**

జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా నిర్ధారణ పరీక్షలను ఉచితంగా చేస్తున్నారు. రక్తపు పూతలు సేకరించి వ్యాధి నిర్ధారణ జరిగితే క్లోరోక్విన్, ప్రై మాక్విన్ అనే మాత్రలను ఇస్తారు. ఇవి 14 రోజులు ఆపకుండా తప్పని సరిగా వాడాలి. ఈ మందులన్నీ కూడా ఉచితంగా అందిస్తారు. కొన్ని సందర్భాల్లో వైద్య సిబ్బంది ఇళ్లకు వెళ్లి రక్తపు పూతలు సేకరిస్తారు. పూర్వం కేవలం ఐదు రోజుల మందులు వాడితే సరిపోయేది. కాని న్యూడ్రగ్‌పాలసీ 2012 ప్రకారం తప్పని సరిగా 14 రోజులు వాడాలి.

**మలేరియాను తరిమికొడదాం..**

గుంటూరు వెస్ట్: మలేరియా వ్యాధిని సంపూర్ణంగా సమాజం నుంచి తరిమికొట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జేసీ జి.రాజకుమారి, ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ ప్రత్యేక పోస్టర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ మంగళవారం ప్రపంచ మలేరియా దినాన్ని పురస్కరించుకుని ర్యాలీని నిర్వహించడంతోపాటు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. 2030 నాటికి దేశం నుంచి మలేరియాను సాగనంపుదామని పేర్కొన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ శివన్నారాయణ శర్మ, డీఆర్‌ఓ చంద్రశేఖరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.వెంకటరామిరెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రావణ్ బాబు పాల్గొన్నారు.

**అవగాహన కల్పిస్తున్నాం..**



జిల్లాలో మలేరియా జ్వరం 2022లో 24 మందికి సోకింది. వీటిల్లో గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 22, ప్రత్తిపాడులో ఒకటి, తాడికొండలో ఒకటి చొప్పున కేసులు వచ్చాయి. 2023లో గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో నాలుగు, తెనాలిలో ఒకటి మొత్తం ఐదు మలేరియా కేసులు నమోదయ్యాయి. మలేరియా డే సందర్భంగా ప్రజలకు వ్యాధిపై అవగాహన కల్పించేందుకు మంగళవారం గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నాం.

– జిల్లా మలేరియా అధికారి టీఎంకే సుబ్బరాయణం

**దోమ కాటు వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి..**

దోమ కాటు ద్వారా వ్యాపించే మలేరియా, డెంగీ, ఇతర జ్వరాలకు అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఉచిత వైద్య సేవలు అందిస్తున్నాం. దోమల ద్వారా మలేరియా సోకుతుంది కాబట్టి ఇంటి పరిసరాలలో దోమలు పెరిగేందుకు ఆస్కారం లేకుండా మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. దోమతెరలు వాడటం ద్వారా దోమకాటు బారిన పడకుండా కాపాడుకోవచ్చు.

– డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి

## గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ వ్యవస్థ కీలకం

**జాతీయ పంచాయతీ అవార్డుల పంపిణీలో కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి**



అవార్డు అందజేస్తున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, జేసీ రాజకుమారి

గుంటూరు వెస్ట్: గ్రామాభివృద్ధిలో పంచాయతీ వ్యవస్థ ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన సంస్కరణల కారణంగా పంచాయతీ స్థాయిలో అభివృద్ధి, మౌలిక సౌకర్యాల కల్పన, సుపరిపాలనకు అవకాశమేర్పడిందన్నారు. ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి గ్రామాల్లో సచివాలయాలు, అర్బన్ హెల్త్ క్లినిక్‌లు, అంగన్‌వాడీలు తదితర నూతన భవనాలు నిర్మిస్తూ పాలనను ఇంటి ముందుకే తీసుకొచ్చిందన్నారు. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత, ఉపాధి మార్గాల పెంపు, పేదలకు ఇళ్ల నిర్మాణం తదితర సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రభుత్వం పేదల స్థితిగతులను మారుస్తుందని కలెక్టర్ చెప్పారు. జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ 73వ రాజ్యాంగ సవరణ ద్వారా 1994 తర్వాత నూతన పంచాయతీ రాజ్ చట్టం ఏప్రిల్ 24న అమల్లోకి వచ్చిందన్నారు. అప్పటి నుంచి జాతీయ దినోత్సవంగా జరుపుకొంటున్నామని చెప్పారు. అనంతరం 11 మంది ఉద్యోగులకు జాతీయ పంచాయతీ రాజ్ అవార్డులను కలెక్టర్, జేసీ ప్రదానం చేశారు. డీఆర్‌ఓ చంద్రశేఖరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.వెంకటరామిరెడ్డి, డీపీఓ ఆర్.కేశవరెడ్డి, జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పురస్కారం అందుకున్న నడింపాలెం సర్పంచ్




పంచాయతీ రాజ్ కమిషనర్ చేతులమీదుగా పురస్కారం అందుకుంటున్న సర్పంచ్ లాం రత్నకుమార్

నడింపాలెం (ప్రత్తిపాడు): ప్రత్తిపాడు మండలం నడింపాలెం గ్రామ సర్పంచ్ లాం రత్నకుమార్ రాష్ట్రస్థాయి పురస్కారాన్ని అందుకున్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 27 గ్రామ పంచాయతీలను రాష్ట్ర స్థాయి పురస్కారాలకు ఎంపిక చేసింది. అందులో భాగంగా హెల్దీ పంచాయతీ (ఆరోగ్యకరమైన గ్రామ పంచాయతీ) థీమ్‌లో నడింపాలెం గ్రామ పంచాయతీ రాష్ట్ర స్థాయి పురస్కారానికి ఎంపికైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ కార్యాలయంలో జరిగిన పురస్కార పంపిణీ కార్యక్రమంలో ఆ శాఖ కమిషనర్ సూర్యకుమారి నడింపాలెం గ్రామ సర్పంచ్ లాం రత్నకుమార్‌కు పురస్కారంతో పాటు సర్టిఫికెట్‌ను అందజేశారు. వెంట పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాజా తదితరులున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్‌తో పాటు పంచాయతీ సిబ్బందికి మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా పంచాయతీ అధికారి ఆర్.కేశవరెడ్డి, ఎంపీడీఓ శ్రీరమ్య, ఈఓపీఆర్డీ మావులూరి మోషె, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# తెనాలి ఖ్యాతిని లోకానికి చాటిన దుర్గాప్రసాద్

**కాంస్య విగ్రహావిష్కరణ, జయంతి సభలో ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రముఖులు**



నాగళ్ల వేంకట దుర్గాప్రసాద్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: కళ, సాహితీ, సాంస్కృతిక రంగాల్లో తెనాలి ఖ్యాతిని భావితరాలకు అందించటానికి నిరుపమానంగా కృషిచేసిన దీపధారి నాగళ్ల వేంకట దుర్గాప్రసాద్ అని ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన వివిధ రంగాల ప్రముఖులు తమ ప్రసంగాల్లో స్మరించుకున్నారు. కళాబంధు నాగళ్ల వేంకట దుర్గాప్రసాద్ జయంతి సందర్భంగా సోమవారం రాత్రి ఆయన కాంస్య విగ్రహాన్ని బుర్రిపాలెంరోడ్డులో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆవిష్కరించారు. అనంతరం తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రమ్‌లో జరిగిన జయంతి సభకు ప్రముఖ కవి మొవ్వా శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ తెనాలి ఖ్యాతికి కారకులైన మహనీయుల లెగసీని భావితరాలకు కనెక్ట్ చేసిన ప్రముఖుడు దుర్గాప్రసాద్ కృషి కొనసాగాలన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. స్థానిక ఎమ్మెల్యేగా అలాంటి మహానుభావుల విగ్రహాలను తెనాలి బండ్‌పై ప్రతిష్ఠించనున్నట్టు వెల్లడించారు. ప్రముఖ కవి, తెలంగాణ ఎమ్మెల్సీ గోరటి వెంకన్న మాట్లాడుతూ నిరంతరం కళల కోసం బతికే కోటికొక్కరులో దుర్గాప్రసాద్ ఒకరని చెప్పారు. తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ తన ప్రసంగంలో, ఘనమైన తెనాలి వారసత్వాన్ని లోకానికి చాటిన దుర్గాప్రసాద్ నిజమైన దేశభక్తుడని అన్నారు. విరసం అధ్యక్షుడు అరసవల్లి కృష్ణ మాట్లాడుతూ కళాకారులకు ఎంతగానో సేవచేసిన దుర్గాప్రసాద్ మరింతకాలం జీవించివుంటే తమకెంతో ఆసరాగా ఉండేవారని పేదకళాకారులు భావిస్తున్నారని చెప్పారు. దిగంబర కవి తోద్యమ సారథి నగ్నముని మాట్లాడుతూ తెనాలిని మొత్తం తెనాలివారికి కనెక్ట్ చేసిన దుర్గాప్రసాద్ ఆలోచనలు, కార్యక్రమాలు కొనసాగించాలని అభిప్రాయపడ్డారు. చనిపోయినా బతికుండే అతికొద్ది మందిలో దుర్గాప్రసాద్ ఒకరని ప్రముఖ నాటకకర్త, రచయిత పాటిబండ్ల ఆనందరావు చెప్పారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, ఒంగోలు జిల్లాపరిషత్ మాజీ చైర్మన్ ఈదర హరిబాబు, వివేక సర్వీసెస్ సొసైటీ అంబటి మురళీకృష్ణ, నటుడు, దర్శకుడు నాయుడు గోపి, వైఎస్ కృష్ణేశ్వరరావు, రచయిత కూనపురాజు కుమారరాజు, తెలంగాణ విద్యావేత్త ఐవీ రమణారావు, న్యాయవాది వై.వేణుగోపాలరెడ్డి తదితరులు మాట్లాడారు. ఎం.రామలింగేశ్వరుడు స్వాగతం పలికారు. కమిటీ సభ్యులు కొండముది రమేష్‌బాబు, ఆర్‌అండ్‌బీ రాజు, షేక్ కాలేషావలి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్యానికి 'ఫ్యామిలీ డాక్టర్' భరోసా

**కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి**

**గుంటూరు వెస్ట్:** ప్రభుత్వం వినూత్నంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానం పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తోందని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ఓపీలు, రక్త పరీక్షలు, ఫాలోఅప్‌లపై కొన్ని క్షేత్ర స్థాయి ఇబ్బందులుంటే వాటిని వెంటనే పరిష్కరిస్తామన్నారు. పీహెచ్‌సీలలో ఈకేవైసీ పూర్తి చేసి ఫీవర్ సర్వేతోపాటు గర్భిణులకు హెచ్‌బీ శాతం పరీక్షలు నూరు శాతం మూడు రోజుల్లోనే పూర్తి చేయాలన్నారు.

**డ్రాపవుట్స్‌పై శ్రద్ధ పెట్టాలి**

వచ్చే విద్యా సంవత్సరంలో పాఠశాలల్లో డ్రాపవుట్స్ లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విద్యాశాఖాధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో పిల్లలందరూ నూరు శాతం మధ్యాహ్న భోజనం తీసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించాలని చెప్పారు. మనబడి నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా పూర్తి చేసిన పనులకు సంబంధించి బిల్లులను వెంటనే అప్‌లోడ్ చేయాలని చెప్పారు. పాఠశాలల్లో మార్గదర్శకాలను అనుసరించి వాచ్ మెన్‌ను నియమించుకోవాలని కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ ఎ.శ్రవణ్ బాబు, డీఈఓ శైలజ, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ జయరామకృష్ణ పాల్గొన్నారు.

**కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలను సద్వినియోగం చేసుకోండి**

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం జీవన్ జ్యోతి, పీఎం సురక్ష బీమా పథకాలను అర్హులైన వారంతా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారితో కలిసి నిర్వహించిన బ్యాంకర్ల ప్రత్యేక డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకు ఖాతా ఉన్న వారందరూ ఈ పథకాలకు అర్హులని వివరించారు. పీఎం జీవన్ జ్యోతి బీమా పథకం ద్వారా 18 నుంచి 50 ఏళ్ళ వయస్సు ఉన్న వారు ఏడాదికి రూ.436 చెల్లిస్తే రూ.2 లక్షల బీమా, పీఎం సురక్ష బీమా కింద 18 నుంచి 70 ఏళ్ల మధ్య వయస్కులు ఏడాదికి రూ.20 చెల్లిస్తే రూ.2 లక్షల బీమా అందుతాయని వివరించారు. దీంతోపాటు అంగవైకల్యం కలిగినా బీమా వర్తిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ శివన్నారాయణ శర్మ, డీఆర్వో చంద్రశేఖర రావు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ ఎం.వెంకట రామిరెడ్డి, ఎల్‌డీఎం ఈదర రాంబాబు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తాచాటిన క్రీడాకారులు

- ఐదు బంగారు, నాలుగు సిల్వర్ పతకాలు కైవసం
- వంశీకృష్ణకు రాష్ట్ర స్థాయి స్ట్రాంగ్ మెన్ టైటిల్


పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్ సురేష్, రాష్ట్ర స్థాయి స్ట్రాంగ్ మెన్ టైటిల్ సాధించిన వంశీకృష్ణ

**సత్తెనపల్లి:** రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలో పల్నాడు జిల్లాకు చెందిన క్రీడాకారులు సత్తా చాటారు. విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీలో 21వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ సబ్ జూనియర్, జూనియర్, మాస్టర్స్ మెన్ అండ్ ఉమెన్ క్రీడా పోటీలు ప్రతిష్టాత్మకంగా జరిగాయి. ఈ పోటీలలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర స్థాయి స్ట్రాంగ్ మెన్ టైటిల్ పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన పసుపులేటి వంశీకృష్ణ సాధించాడు. పల్నాడు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్‌కు చెందిన క్రీడాకారులు ఐదు బంగారు పతకాలు, నాలుగు వెండి పతకాలు కైవసం చేసుకొని పల్నాడు జిల్లా ప్రతిష్ట చాటారు. సబ్ జూనియర్ విభాగంలో 53 కిలోల విభాగంలో గురజాలకు చెందిన కె.కార్తీక్ (గోల్డ్ మెడల్), 66 కేజీల విభాగంలో సత్తెనపల్లికి చెందిన షేక్ కరీం(గోల్డ్ మెడల్) సాధించారు. జూనియర్ విభాగంలో 53 కేజీల విభాగంలో గురజాలకు చెందిన ఎం.అనుష(బంగారు పతకం), 53 కేజీల విభాగంలో సత్తెనపల్లికి చెందిన ఎస్కే గౌస్(నాలుగో స్థానం), 59 కిలోల విభాగంలో సత్తెనపల్లికి చెందిన ఫ్రాన్సిస్(సిల్వర్ మెడల్), 59 కేజీల విభాగంలో సత్తెనపల్లికి చెందిన సౌరబ్(సిల్వర్ మెడల్), 66 కేజీల విభాగంలో వెన్నాదేవికి చెందిన ఎస్.శరత్ (సిల్వర్ మెడల్), 74 కిలోల విభాగంలో పసుపులేటి వంశీకృష్ణ(రెండు గోల్డ్ మెడల్స్) సాధించాడు. 74 కేజీల విభాగంలో ఎస్.ఈశ్వర్ నాలుగో స్థానం కైవసం చేసుకున్నాడు. మాస్టర్స్ విభాగంలో 105 కిలోల విభాగంలో గురజాలకు చెందిన కె.జ్యోతిబాబు(రెండు సిల్వర్ మోడల్స్) సాధించాడు. పోటీలల్లో క్రీడాకారులు ప్రతిభ చూపేందుకు పల్నాడు జిల్లా అసోసియేషన్ సెక్రటరీ, అంతర్జాతీయ క్రీడాకారుడైన పసుపులేటి సురేష్ శిక్షణ లోభాగంగా మెలుకువలు నేర్పి తర్ఫీదును అందించాడు. ప్రతిభ చూపిన క్రీడాకారులను, కోచ్‌ను ఆంధ్రప్రదేశ్ భారీ నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు, పల్నాడు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జిమ్ రాజు, గుజ్జర్లపూడి ఆనంద్, ఎస్.మణిరత్నం, టీ శంకర్, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాతంగి సాంబశివరావు సోమవారం అభినందించారు.

# నిర్లక్ష్యమే కారణమంట

- అలసత్వం వీడితేనే నివారణ సాధ్యం
- వేసవిలోనే అత్యధిక అగ్నిప్రమాదాలు
- అత్యాధునిక పరికరాలతో అగ్నిమాపక శాఖ సేవలు
- నాలుగేళ్లలో రూ.167 కోట్ల విలువైన ఆస్తుల రక్షణ


అగ్నికీలలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది (ఫైల్)

**పట్నంబజారు(గుంటూరు):** వేసవిలో ఎండ ధాటికి అగ్నిప్రమాదాలు అధికంగా జరిగే ఆస్కారం ఉంటుంది. అందుకే అందరూ అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఎక్కువగా ప్రమాదాలకు నిర్లక్ష్యమే కారణమని సూచిస్తున్నారు. మంటలు చెలరేగే తీరు, నివారణ చర్యలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని హితవు పలుకుతున్నారు.

**అగ్నిమాపక శాఖ పనితీరు భేష్**

జిల్లాలో అగ్నిమాపక శాఖ నిరంతరం శ్రమిస్తోంది. మంటలను అదుపు చేసేందుకు అత్యాధునిక పరికరాలు సమకూర్చుకుంది. ఎలాంటి ప్రమాదాలనైనా ఎదుర్కొనేందుకు సదా సిద్ధంగా ఉంది. వేసవిలో ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇటీవలే జిల్లా వ్యాప్తంగా అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించి విద్యార్థులు, మహిళలకు అగ్నిప్రమాదాలు సంభవించే తీరుపై అవగాహన కల్పించింది. ప్రమాదాలను ఎలా నివారించాలో ప్రయోగాత్మకంగా డెమో ప్రదర్శనల ద్వారా వివరించింది.

**మరో రెండు ఫైర్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు**

ప్రస్తుతం గుంటూరు జిల్లాలో గుంటూరు, 1, 2, తెనాలి, మంగళగిరి, పొన్నూరు, వెలగపూడి, సీఎం క్యాంపు కార్యాలయంలో ఫైర్‌స్టేషన్స్ ఉన్నాయి. వెలగపూడి, హైకోర్టు, సీఎం క్యాంపు కార్యాలయాల్లో ఉన్న అగ్నిమాపక దళాలు తాత్కాలికమే. వేమూరు, ప్రత్తిపాడు కేంద్రాల్లో మరో రెండు ఫైర్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయి. జిల్లాలో ఒక డీఎఫ్ఓ, ఇద్దరు ఏడీఎఫ్ఓలు, 92 మంది సిబ్బందితోపాటు, వెలగపూడి, సీఎం క్యాంపు కార్యాలయం, హైకోర్టు ప్రాంతంలో మరో 50 మంది సిబ్బంది అదనంగా విధులు నిర్వర్తిస్తున్నారు.

**ప్రైవేటు వ్యక్తులకూ శిక్షణ**

అగ్నిమాపక శాఖ అధికారులు ఎన్‌ఓసీ జారీ చేసిన ప్రతి పరిశ్రమ, ఆస్పత్రి, కంపెనీలు, సినిమాహాళ్లు, ఇతరత్రా వాణిజ్య సముదాయాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూనే ఉన్నారు. ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలపై తనిఖీలు చేపడుతున్నారు. నిబంధనలు పాటించని యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవటంతోపాటు జరిమానాలు విధిస్తున్నారు. కొంచెం సిబ్బంది కొరత ఉన్న నేపథ్యంలో ప్రైవేట్ కంపెనీల్లో కొంత మంది ఆసక్తి కలిగిన వ్యక్తులకు అగ్నిమాపక సిబ్బంది తర్ఫీదు ఇస్తున్నారు. గత ఏడాది పలు కంపెనీల నుంచి 250 మందికి అగ్నిప్రమాదాల నివారణపై శిక్షణ ఇచ్చారు. మరో 150 నుంచి 200 మందికి త్వరలోనే శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నట్టు అధికారులు చెబుతున్నారు.

**అత్యాధునిక పరికరాలతో**

గతంలో కేవలం ఫైర్ ఇంజన్లతోనే ప్రమాదాలను నివారించిన అగ్నిమాపక శాఖ తన అంబులపొదిలో మరిన్ని అత్యాధునిక పరికరాలను సమకూర్చుకుంది. వీటిల్లో ఫ్లోటింగ్ పంపు, చిన్నచిన్న సందుల్లోకీ వెళ్లే మిస్ట్ బుల్లెట్స్, డీసీపీ ట్రాలీలు ముఖ్యమైనవి. పరిశ్రమలు, నివాసాలతోపాటు ఎక్కడ విద్యుత్ ప్రమాదాలు జరిగినా డీసీపీ ట్రాలీ ద్వారా మంటలను అదుపుచేయవచ్చు. అత్యవసర సమయంలో నీరు సరిపోనప్పుడు దగ్గరలోని నీటి వనరులను ఉపయోగించుకునేందుకు ఫ్లోటింగ్ పంపు ఉపయోగపడుతుంది. 24/7 అన్ని ఫైర్ స్టేషన్లలో సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. ప్రస్తుతం జిల్లాలో మొత్తం ఏడు ఫైరింజన్లు, 5 మిస్ట్ బుల్లెట్స్ తోపాటు పలు రకాల పరికరాలు ఉన్నాయి.

**ప్రమాదాల నివారణకు కృషి**

నిర్లక్ష్యం వల్లే అత్యధిక ప్రమాదాలు జరుగుతున్నాయి. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రజలకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నాం. అవగాహన కార్యక్రమాలు సత్ఫలితాలనిస్తున్నాయి. ఏటేటా ప్రమాదాల సంఖ్య తగ్గుతోంది. ప్రమాదం జరిగిన వెంటనే తమ సిబ్బంది మంటల అదుపునకు ప్రాణాలకు తెగించి కృషి చేస్తున్నారు. ప్రమాదం జరిగినప్పుడు డయల్ 101కు సమాచారం ఇస్తే నిమిషాల వ్యవధిలో స్పందిస్తాం.

– ఎస్.వెంకటేశ్వరరావు, డీఎఫ్ఓ

**నాలుగేళ్లలో ప్రమాదాలు ఇలా..**

| సంవత్సరం | ప్రమాదాలు | ఆస్తినష్టం | పరిరక్షించిన ఆస్తుల విలువ |
|---|---|---|---|
| | | (రూ.కోట్లలో) | (రూ.కోట్లలో) |
| 2019 – 20 | 591 | 7.07 | 24.44 |
| 2020 – 21 | 552 | 2.83 | 23.29 |
| 2021 – 22 | 552 | 4.15 | 92.26 |
| 2022 – 23 | 490 | 0.42 | 27.25 |
| మొత్తం | 2,185 | 14.47 | 167.24 |


డీసీపీ ట్రాలీ


అత్యవసర పరిస్థితుల్లో వినియోగించే ఫ్లోటింగ్ పంపు

# చట్టపరిధిలో సమస్యల పరిష్కారం

**పోలీస్ స్పందనలో ఏఎస్పీ కె.సుప్రజ**

**నగరంపాలెం(గుంటూరు వెస్ట్):** జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక–స్పందన (గ్రీవెన్స్) జరిగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల వద్ద అర్జీలను ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ స్వీకరించారు. బాధితుల సమస్యలను ఆలకించారు. సబ్ డివిజన్లలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో జూమ్ ద్వారా ఏఎస్పీ మాట్లాడారు. స్పందనలో వచ్చే అర్జీలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయా సమస్యలను చట్ట పరిధిలో మాత్రమే పరిష్కరించాలని సూచించారు. అర్జీలపై నిర్లక్ష్యం వద్దని స్పష్టం చేశారు. డీసీఆర్బీ డీఎస్పీ శ్రీనివాసరావు కూడా అర్జీలు స్వీకరించారు.

**ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి**

ఈనెల 14 అంబేడ్కర్ జయంతి సందర్భంగా ప్రత్తిపాడు పాతమల్లాయపాలెంలో దళితులపై దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ఏఎస్పీ సుప్రజకు వినతిపత్రం అందించారు.


ఏఎస్పీ సుప్రజకు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు తదితరులు

**ప్రాణహాని ఉంది రక్షణ కల్పించండి**

ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని జిల్లా వక్ఫ్‌బోర్డు సంయుక్త కార్యదర్శి షేక్ సుభానీ సోమవారం ఐజీ కార్యాలయంలో ఐజీ పాల్‌రాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సుభానీ మాట్లాడుతూ ఈనెల 16న ఓ ప్రజాప్రతినిధి ప్రమేయంతో కొందరు తనపై హత్యాయత్నం చేశారని, నిందితులపై చర్యలు తీసుకోవాలని ఇటీవల ఎస్పీ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశానని వివరించారు. అయినా హత్యాయత్నానికి పాల్పడిన వారిపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదని, తనకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని కోరారు.

**విదేశీవిద్యకు రుణం ఇప్పిస్తామని మోసం**

నా మూడో కుమార్తె విదేశీ విద్య కోసం రుణం ఇప్పిస్తామని బాపట్లకు చెందిన కొందరు నమ్మించారు. దశల వారీగా రూ.6.25 లక్షలు తీసుకున్నారు. కానీ రుణం మంజూరు కాలేదు. డబ్బులు అడిగితే లేవని బెదిరిస్తున్నారు. వారి నుంచి ప్రాణ హాని ఉంది. న్యాయం చేయగలరు.

– శివభాను, పొన్నూరు.

**నగదు ఇప్పించి న్యాయం చేయండి**

మేం 460 బస్తాల మిర్చిని ఓ వ్యక్తికి విక్రయించాం. ఇప్పటివరకు నగదు చెల్లించలేదు. దీనిపై గత సోమవారం కూడా ఎస్పీ స్పందనలో ఫిర్యాదు చేశాం. న్యాయం చేయాలి.

– జె.వెంకటేశ్వర్లు, నాగిశెట్టి రామారావు, ఎన్.రవిబాబు, తదితర రైతులు, మేడికొండూరు పొట్లపాడు

## చేపల వేట సరదా.. ప్రాణం తీసింది

**శావల్యాపురం:** గంటావారిపాలెం సమీపాన అద్దంకి బ్రాంచ్ కెనాల్‌లో చేపల వేటకు వెళ్లి యువకుడు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. వినుకొండ రూరల్ ఏనుగుపాలేనికి చెందిన తమలాపాకుల సోనికుమార్(19) వినుకొండ డిగ్రీ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు సరదాగా తన స్నేహితులు ఆరుగురితో కలిసి చేపల వేటకు వెళ్లాడు. అడవిపాలెం పవర్ ప్లాంటు సమీపాన చేపలు పడుతుండగా ప్రమాదవశ్తు కాలువలో పడిపోయి మృతి చెందాడు.

## రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

**నరసరావుపేట టౌన్:** రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం మునమాక రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. మునమాక, సంతమాగులూరు మార్గంలో సుమారు 45 ఏళ్ల వయసు ఉన్న వ్యక్తి పట్టాలపై మృతి చెంది ఉన్నాడన్నా సమాచారం మేరకు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నట్లు ఎస్ఐ పి. సుబ్బారావు తెలిపారు. మృతుడు తెల్ల చొక్కా, నీలం రంగు లుంగి ధరించి ఉన్నాడు.

# నవ రసాలు పండించిన 'నాన్న నేనొచ్చేస్తా'

- ముగిసిన కొండవీడు కళా పరిషత్ 24వ జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు
- ఉత్తమ ప్రదర్శనగా నిలిచిన 'నాన్న నేనొచ్చేస్తా' నాటిక
- ద్వితీయ, తృతీయ ప్రదర్శనలుగా చీకటి పువ్వు, థింక్ నాటికలు


ఉత్తమ ప్రదర్శన బహుమతి అందుకుంటున్న 'నాన్న నేనొచ్చేస్తా' నాటిక దర్శకురాలు అమృతవర్షిణి

**యడ్లపాడు:** కళా సంబరం ముగిసింది. చారిత్రక ప్రసిద్ధి చెందిన కొండవీడు పేరిట లింగారావుపాలెంలో 'కొండవీటి కళా పరిషత్' కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలకు తెరపడింది. గ్రామంలోని జెడ్పీ హైస్కూల్లో పోసాని సుబ్బారావు కళా వేదికపై రెండు తెలుగు రాష్ట్రాల్లోని కళా సంస్థలు 9 కళా రూపాలు తమ ప్రదర్శనలిచ్చాయి. నవరత్నాల్లాంటి నాటికల్లో ఉత్తమ ప్రదర్శన, వ్యక్తిగత బహుమతులను కమిటీ సభ్యులు అందించి, సత్కరించారు. న్యాయ నిర్ణేతలు జీఎస్ ప్రతాప్‌రెడ్డి, శొంఠినేని కిషోర్, అంచూరి నర్సిరెడ్డి బహుమతుల వివరాలు వెల్లడించారు. పోటీల నిర్వహణను జయప్రదం చేసిన పరిషత్ సభ్యుల్ని అభినందించారు.

**'నాన్న నేనొచ్చేస్తా' నాటికకు 5 బహుమతులు**

గుంటి రాజేశ్వరీ మూల కథకు తాళ్ల బత్తుల వెంకటేశ్వరరావు నాటకీకరణ చేసి, అమృతలహరి దర్శకత్వం వహించిన శ్రీ అమృతలహరి థియేటర్స్ ఆర్ట్స్ (గుంటూరు) వారి ''నాన్నా నేనొచ్చేస్తా'' నాటిక ఉత్తమ ప్రదర్శన బహుమతిని కైవసం చేసుకుంది. ఇదే బృందంలోని ఉత్తమ క్యారెక్టర్ ఆర్టిస్ట్ అమృత వర్షిణి, ఉత్తమ సహాయ నటుడు ఎస్‌కేడీ హసన్, ఉత్తమ హాస్య నటుడు టి.వెంకటేశ్వరరావు, ఉత్తమ రచయిత టి.వెంకటేశ్వరరావుకు బహుమతులు దక్కాయి.

**'చీకటి పువ్వు' నాటికకు ఐదు బహుమతులు**

పరమాత్ముని శివరాం రచనకు మంచాల రమేష్ దర్శకత్వం వహించి చైతన్య కళాభారతి (కరీంనగర్) వారి నాటిక 'చీకటి పువ్వు' ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా నిలిచింది. ఇదే నాటికకు ఉత్తమ దర్శకుడు మంచాల రమేష్, ఉత్తమ సంగీత దర్శకుడు నాగరాజు, ఉత్తమ నటిగా గుడివాడ లహరి, ప్రత్యేక జ్యూరీ అవార్డును గిరిబాబు అందుకున్నారు.

**'థింక్' నాటికకు నాలుగు..**

మంజూనాథ రచన, దర్శకత్వం వహించి సిరిమువ్వ కల్చరల్ అసోసియేషన్ (హైదరాబాద్) వారి నాటిక 'థింక్' ఉత్తమ తృతీయ ప్రదర్శనగా బహుమతి పొందింది. ఈ నాటికకు ఉత్తమ నటుడు సతీష్‌కుమార్, ఉత్తమ ఆహార్యం అమృత వర్షిణి, ప్రత్యేక జ్యూరీ అవార్డును వేణుగోపాల్‌కు లభించాయి.

**'రైతే రాజు'కు రెండు అవార్డులు..**

అలాగే కంచర్ల సూర్య ప్రకాష్ రచనకు కొల్లా రాధాకృష్ణ దర్శకత్వం వహించిన కళాంజలి (హైదరాబాద్) వారి ''రైతేరాజు'' నాటిక ప్రత్యేక జ్యూరీ ప్రదర్శనకు ఎంపిక కాగా, ఇందులో నటించిన ఏపూరి శ్రీనివాస్‌కు కూడా ప్రత్యేక జ్యూరి అవార్డు రావడం గమనార్హం. ఇవీగాక రంగాలంకరణ ఎస్.రామమోహన్‌రావు (వెండి అంచులు), ఉత్తమ క్యారెక్టర్ ఆర్టిస్ట్ ఎస్.వెంకటేశ్వర్లు (స్థిరాస్తి), ఉత్తమ సహాయ నటులు, జీఎస్‌డీ కుసుమ సాయి(కాపలా), ఉత్తమ విలన్ గోప రాజు విజయ్ (ప్రేమతో నాన్న), ప్రత్యేక జ్యూరీ అవార్డులను ఎస్.సూర్య(అస్థికలు), వసంతయామిని (వెండి అంచులు), ఇ.భాగ్యరాజ్(కాపలా) అందుకున్నారు.

ఈ కార్యక్రమాన్ని పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు కట్టా శ్రీహరిరావు, మండెపూడి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు తోకల సాంబ శివరావు, నంబూరి వీరాంజనేయులు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు మల్నేని సీతారామాంజనేయులు, కనపర్తి శ్రీనివాసరావు, కోశాధికారులు కట్టా వీరాంజనేయులు, నంబూరు శివ రామకృష్ణ, సభ్యులు కావటి సాంబయ్య, నంబూరు ఉల్లయ్య, రంగస్థల, సినీ దర్శక రచయిత జరుగుల రామారావు పర్యవేక్షించారు.

# అదుపు తప్పిన రొయ్యల వాహనం

**రూ.3 లక్షల నష్టం**


మార్జిన్‌లోకి దూసుకెళ్లిన రొయ్యల వాహనం

**మార్టూరు:** రొయ్య పిల్లలను తరలిస్తున్న వాహనం జాతీయ రహదారిపై అదుపు తప్పడంతో నష్టం వాటిల్లింది. అందిన వివరాల మేరకు.. సోమవారం నెల్లూరు నుంచి విజయవాడకు రొయ్య పిల్లలను తరలిస్తున్న వాహనం కోనంకి, ఇసుదరిశి గ్రామాల మధ్య పెట్రోలు బంకు ఎదురు అదుపుతప్పి మార్జిన్‌లోకి దూసుకెళ్లింది. ప్రమాద తీవ్రతకు వాహనంలో ఉన్న రొయ్య పిల్లల సంచులు రోడ్డుపై పడి ధ్వంసం అయ్యాయి. కాగా ఎండ తీవ్రతకు రొయ్యలు చాలావరకు మృతి చెందాయి. సుమారు రూ.3 లక్షల నష్టం వాటిల్లిందని వాహన డ్రైవర్ తెలిపాడు.